# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-11-2024     సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

❖ విజయనగరం స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

❖ రేపటి నుంచి 3 రోజులపాటు పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర స్థాయి 68వ విలు విద్య క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పాఠశాల క్రీడల జిల్లా అధ్యక్షులు ఎస్. తిరుపతినాయుడు తెలియజేశారు.

========================

రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్ గా మారుస్తామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారి గుంతలు పూడ్చే కార్యక్రమాలు ఈ రోజు ప్రారంభమైన సందర్భంగా అనకాపల్లి జిల్లా పరవాడలో గుంతలు పడిన రోడ్లను పూడ్చే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో మొత్తం గుంతలు పూడ్చే విధంగా 860 కోట్ల రూపాయలతో పనులను చేపడుతున్నామని తెలిపారు. రహదారులు బాగుంటే వ్యాపారాలు బాగుంటాయని, రహదారులపై గుంతలు లేకుండా చూసే భాద్యత తమదేనని ఉద్ఘాటించారు. నక్కపల్లి వద్ద ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తామని, రతన్ టాటా స్ఫూర్తితో ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 46 సెకన్లు)

========================

రాష్ట్ర స్థాయి 68వ విలు విద్య క్రీడా పోటీలు రేపటి నుంచి 3 రోజుల పాటు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగంపేట గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ప్రాంగణంలో జరుగుతాయని పాఠశాల క్రీడల జిల్లా అధ్యక్షులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. తిరుపతినాయుడు తెలిపారు. ఈరోజు జోగింపేటలో పిడిలు, పిఈటిలతో సమావేశాన్ని నిర్వహించారు. 3 రోజుల పాటు క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని వారిని కోరారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే క్రీడాకారులకు భోజన, వసతి ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అండర్-14, అండర్ -17, అండర్ - 19 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

========================

రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆస్ట్రేలియా జరుగనున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశాలలో పాల్గొనేందుకు వెళ్లారు. కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్ పర్సన్ గా, కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ స్టీరింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా ప్రస్తుతం ఆమె వ్యవహరిస్తున్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో ఈ సమావేశాలు జరుగుతాయి. 50కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతుండగా, భారత్ నుండి ఎంపీ పురందేశ్వరి పాల్గొంటున్నారు. ప్రపంచంలో మహిళలు ఎదుర్కొనే వివిధ సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చించడంతో పాటు వివిధ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపు తదితర అంశాలపై కూడా చర్చలు జరుపుతారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ప్రారంభం కాగా పలు చోట్ల ఈ కార్యక్రమంలో మంత్రులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మాముడూరులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతల రహదారులను పూడ్చి, వచ్చే సంవత్సరం నుండి నూతన రహదారులను నిర్మిస్తామని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. అలాగే పాలకొల్లులో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. గుంతల రహిత రహదారుల లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)..

విరామం

========================

కార్తీక మాసం ప్రారంభమైన నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఈరోజు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం వెలుపల ఉన్న వినాయకుని ఆలయం, స్నాన ఘట్టాల వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక దీపాలను హారతులుగా ఇచ్చారు. శ్రీకాళహస్తి దేవస్థానం వేద పండితులు అర్ధగిరి స్వామి ఈ సందర్భంగా.. ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల గూర్చి వివరిస్తూ..

(వాయిస్ 24 సెకన్లు)

========================

విజయనగరం స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 11వ

తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 12న నామినేషన్లు పరిశీలన, 14న ఉపసంహరణకు చివరి తేదీ కాగా, నవంబర్ 28న పోలింగ్, డిసెంబర్ 1వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు నూతన విధానాలు, కార్యక్రమాలను ప్రకటించకూడదని, అధికారిక కార్యక్రమాలను ఎన్నికల కార్యక్రమాలతో జత చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు జిల్లాలో వీడియో సర్వేలియన్స్ బృందాలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీతో సహా అన్ని బృందాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అందరూ  సహకరించాలని కలెక్టర్ కోరారు.

=========================

విశాఖలోని ఋషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాలు ఎలా  ఉపయోగించాలో త్వరలో ఒక నిర్ణయానికి వస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన మంత్రివర్గ సహచరులతో కలిసి రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను ఈ రోజు పరిశీలించారు.

=========================

భూ యజమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భరోసా కల్పిస్తూ కౌలు రైతులకు మేలు జరిగేలా నూతన కౌలు చట్టాన్ని  తీసుకురావడం జరుగుతుందని వ్యవసాయం, సెరికల్చర్, కో-ఆపరేషన్, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ పేర్కొన్నారు. నూతనంగా తీసుకురానున్న ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం - 2024పై సూచనలు, సలహాలు స్వీకరించేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ లో కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన భూ యజమానులు, కౌలుదారులతో ఈ రోజు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు, భూ యజమానులకు భరోసా కల్పిస్తూ... కౌలుదారులకు పంట రుణాలు అందేలా నూతన సాగుదారుల హక్కుల చట్టం - 2024ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

=========================

తిరుపతి జిల్లా వడమాల పేట మండలంలో చిన్నారిపై హత్యాచార ఘటనపై  విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేరానికి పాల్పడిన వారిని  కఠినంగా శిక్షించాలని ఈ రోజు అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక  సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని కలెక్టర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత బాధిత కుటుంబానికి రేపు అందిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

=========================

కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

=========================

=========================